మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

వీధులను శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ రజిత తదితరులు

హుస్నాబాద్‌టౌన్, జూలై 13: మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉన్నదని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. శనివారం 15వ వార్డులో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో రహదారులను శుభ్రపరిచి, పనికి రాని మొక్కలు, మురుగు కాల్వలో చెత్తను స్వయంగా తొలిగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, కోఅప్షన్‌సభ్యులు శంకర్‌రెడ్డి, అయూబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారులు సాంబరాజు, శివకుమార్, మెప్మా ఆర్పీ సరిత, జవాన్లు సారయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

శిలాఫలకాలకు ఏమైంది?

- రాత్రికి రాత్రే కూల్చివేస్తున్న వైనం
- చేర్యాల, కడవేర్గులో తొలిగింపు

కడవేర్గు సమీపంలో కూల్చివేసిన శిలాఫలకం

చేర్యాల, జూలై 13 : బీఆర్ఎస్ సర్కారు నాడు అభివృద్ధి పనుల శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలు నేడు కూల్చివేతలకు గురవుతున్నాయి. మండలంలోని కడవేర్గు గ్రామ సమీపంలోని లోలెవల్ కల్వర్టు వద్ద రూ.2కోట్ల వ్యయంతో వంతెన నిర్మించేందుకు నాటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించే సమయంలో శిలాఫలకం సైతం అధికారులు ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే నాడు దానిని ప్రారంభించారు. ప్రస్తుతం కడవేర్గు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొన్ని రోజుల క్రితం రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని పెద్ద చెరువు మరమ్మతులు తదితర అభివృద్ధి పనుల కోసం అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, శాసనమండలి సభ్యుడు బోడెకుంటి వెంకటేశ్వర్లతో కలిసి శిలాఫలకం వద్ద పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పెద్ద చెరువు కట్టపై శిలాఫలకం ఏర్పాటు చేసేందుకు నిర్మించిన గద్దె మాత్రమే ఉంది. అందులో శిలాఫలకం కనిపించకుండా పోయిన విషయాన్ని ఇటీవల పలువురు గుర్తించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య పంచాయతీ చేయించేందుకు ఎవరైన అకతాయిలు శిలాఫలకాలను కూల్చివేస్తున్నారా? లేక కావాలనే తమ పార్టీ అధికారంలో ఉందని కొందరు వ్యక్తులు ఇలాంటి ఘటనలకు దిగుతున్నారా? అనే విషయమై పలువురు చర్చించుకుంటున్నారు. శిలాఫలకాలను తొలగిస్తున్న వ్యక్తులపై నిఘా వేసి వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చేర్యాల పట్టణంలోని పెద్ద చెరువు వద్ద నిర్మించిన గద్దెలో కనిపించని శిలాఫలకం

హైకోర్టు జీపీగా రవీందర్

చేర్యాల, జూలై 13 : పట్టణ శివారులోని బండపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది అనంతుల రవీందర్‌ను హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించారు. చేర్యాలకు చెందిన వ్యక్తికి ఇలాంటి అవకాశం రావడం ఇదే మొదటిసారి. హైకోర్టులో న్యాయసేవలు అందిస్తున్న రవీందర్‌కు జీపీగా అవకాశం రావడంతో పలువురు న్యాయవాదులు, వివిధ పార్టీలు, సంస్థల ప్రతినిధులు అభినందించారు.

గజ్వేల్ కోర్టు ఏజీపీగా అనూష

గజ్వేల్, జూలై 13 : గజ్వేల్ ప్రిన్సిపల్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఏజీపీగా గజ్వేల్ పట్టణానికి చెందిన న్యాయవాది ఎం.అనూషను నియామిస్తూ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న పట్టణానికి చెందిన కిరణ్ సాగర్‌రావును నియామిస్తూ ఉత్తర్వులివ్వగా ఈ నెల 8న అదే గజ్వేల్ కోర్టుకు ఏజీపీగా అనూషను నియామిస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. మూడు రోజుల వ్యవధిలోనే మొదట నియమించిన కిరణ్‌సాగర్‌రావు స్థానంలో మరో న్యాయవాది అనూషను నియామించడం చర్చనీయంశంగా మారింది.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి గోపి

చేర్యాల, జూలై 13 : కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఓ పంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో గోపి మాట్లాడుతూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి పురోగతి లేదన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, నాయకులు అరుణ్‌కుమార్, నర్సింహులు, రవీందర్, కుమార్, రాజేశ్, రవి, కనకయ్య, రాములు, గణేశ్, మంతపురి శ్రీకాంత్, ముత్యం కర్ణాకర్, స్వామి, రణం కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో ఆషాఢ ఉత్సవాలు

అభిషేకంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జూలై 13: మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆషాఢ ఉత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, చండీహోమం, పూర్ణహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం పట్టణవాసులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై రాజుగౌడ్

కొమురవెల్లి, జూలై 13 : గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమురవెల్లి ఎస్సై లింగంపల్లి రాజుగౌడ్ అన్నాడు. మండల పరిధిలోని మర్రిముచ్చాలలో శుక్రవారం రాత్రి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూఢనమ్మకాలు, మద్యం తాగితే కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు, పేకాట ఆడితే కుటుంబంలో జరుగుతున్న పరిణామాలు తదితర అంశాలపై పోలీస్ కళాబృందం నాటకం రూపంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మిరెడ్డి

సిద్దిపేట, జూలై 13 : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేసి... లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలలో ప్రమోషన్లు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సంజీవిని పారామెడికల్ కాలేజీలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతుల్లో నాన్ జాయినింగ్, లెఫ్ట్ ఓవర్ ఖాళీలకు, రెండో విడుత కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. మల్టీ జోన్ ఒకటి, రెండులో ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్‌వల్లి అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షులు యాదగిరి, సుజాత, జిల్లా కోశాధికారి కృష్ణ, కార్యదర్శులు వెంకట కిరణ్, ప్రశాంత్ కుమార్, కనకరాజు, గిరిబాబు, యాదయ్య, శివలింగం, నర్సింహులు, రామచంద్ర, నర్సింహులు, శ్రీనివాస్, రవి నాయక్, రాములు, కృష్ణమూర్తి, కనకయ్య పాల్గొన్నారు.

వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ధర్మేంద్ర

హుస్నాబాద్, జూలై 13 : రాష్ట్రంలోని రైతులను ఆదుకోవడంతో పాటు ఆయా రంగాల్లో ఉన్నత చదువులు చదివిన యువతకు ఉద్యోగ కల్పన కోసం రాష్ట్రంలో విరివిగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రభుత్వం నెలకొల్పాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లోని అనభేరి, సింగిరెడ్డి స్మారక భవనంలో జరిగిన హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల ఏఐవైఎఫ్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్, ఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్, నాయకులు వనేశ్, జనార్దన్, గోపి, శ్రీనివాస్, అభిలాశ్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యమ గాయకుడికి సన్మానం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న మంద పవన్, నాయకులు

హుస్నాబాద్, జూలై 13 : ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ సంస్థ నుంచి ఉత్తమ ఉద్యమ గాయకుడి అవార్డు అందుకున్న ప్రముఖ జానపద గాయకుడు గడిపె మల్లేశ్‌ను హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆధ్వర్యంలో మల్లేశ్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ జానపద కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, సీపీఐ నాయకులు శంకర్, రాజ్‌కుమార్, వనేశ్, సంజీవరెడ్డి, జనార్దన్, శ్రీనివాస్, అంతయ్య, మంజుల, భవానీ, రేవతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

రూ.5లకే 20 లీటర్ల వాటర్ క్యాన్

వర్గల్, జూలై 13 : మండల పరిధిలోని ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లారెడ్డిపల్లికి చెందిన జయపాల్‌రెడ్డి గ్రామంలో సురక్షిత మంచినీటిని గ్రామస్తులందరికీ అందించాలనే ఉద్దేశంతో సొంత ఖర్చులతో మినీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ చార్జీలు, ఇతర మెయింటనెన్స్ కోసం గ్రామస్తులకు కేవలం రూ.5లకే 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, ఇతర సామగ్రిని గత మూడేండ్లుగా అందజేస్తున్నారు.

డీజీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను ఉమ్మడి మద్దూరు మండలంలోని అర్జున్‌పట్ల గ్రామానికి చెందిన బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్‌గౌడ్ శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.
– మద్దూరు (ధూళిమిట్ట), జూలై 13

రేపు ఛలో కలెక్టరేట్

మిరుదొడ్డి, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తొగుట మండలంలోని గుడికందుల గ్రామ శివారు నుంచి మిరుదొడ్డి మండలంలోని అల్వాల గ్రామం వరకు ఉన్న గుంతలతో కూడిన మట్టి రోడ్డుపై బీటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న అల్వాల జేఏసీ ఆధ్వర్యంలో గుంతల రోడ్డు మరమ్మతు చేయాలని కోరుతూ ఛలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

మల్లన్న ఆలయ ఉద్యోగికి మెమో జారీ

చేర్యాల, జూలై 13 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయ ఉద్యోగి శ్రీనివాస్‌రెడ్డికి ఈవో బాలాజీ మెమో జారీ చేశారు. మల్లన్న క్షేత్రంలోని కాటేజీలను భక్తులకు కేటాయిస్తున్న క్రమంలో అవకతవకలు జరుగుతున్నాయని ఆలయ ఈవో దృష్టికి వచ్చింది. దీంతో ఆలయ ఏఈవో, సిబ్బంది కొన్ని రోజుల క్రితం రికార్డులు, గదులను తనిఖీ చేయించారు. అవకతవకలు జరిగినట్లు ఇచ్చిన నివేదిక మేరకు ఆలయ ఈవో శ్రీనివాస్‌రెడ్డికి మూడు రోజుల క్రితం మెమో జారీ చేశారు. ఈ మెమోకు సదరు ఉద్యోగి వారంరోజుల్లో ఇచ్చిన వివరణకు ఈవో సంతృప్తి చెందితే ఎలాంటి క్రమశిక్షణ చర్యలు ఉండవని, లేనిపక్షంలో చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది.

అరుణాచలగిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

సిద్దిపేట టౌన్, జూలై 13 : అరుణాచలగిరి ప్రదక్షిణ చేయాలనుకునే ప్రయాణికులకు సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ డిపోలను నుంచి అధునాతన సూపర్ లగ్జరీ బస్సులను ఈ నెల 19నుంచి నడిపించనున్నామని సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీకి నిధుల కేటాయింపుపై హర్షం

హుస్నాబాద్‌టౌన్, జూలై 13: హుస్నాబాద్ మున్సిపాలిటీకి రూ.20కోట్లు మంజూరు కావడంతో పాలకవర్గం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిధులు చేయించిన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి శనివారం మున్సిపల్ పాలకవర్గం కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. స్థానిక ఎల్లమ్మ చెరువుతో పాటు పట్టణాభివృద్ధికి టీయూఎఫ్‌డీసీకి నిధులను కేటాయించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినీదేవి, రమాదేవి, స్వర్ణలత, పద్మ, సుప్రజ, రాజు, శ్రీనివాస్, కోఅప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు

గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

సిద్దిపేట టౌన్, జూలై 13 : సిద్దిపేట వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనితా క్లబ్ అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో వాతవరణంలో వచ్చే మార్పులకు గోరింటాకు పెట్టుకుంటే అంటురోగాలు దరి చేరవని చెప్పారు. ప్రతి ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవాలు వైభవంగ జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మంజుల, నీరజ, అనిత, లత, రాణి తదితరులు పాల్గొన్నారు.

వామ్మో! ఆ ఇన్‌చార్జి బాధ్యతలు మాకొద్దు

- ఐదు నెలల క్రితం మున్సిపల్ శాఖలో ఆర్ఐ బదిలీ
- ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఇప్పటివరకు ముగ్గురు మారిన వైనం



మున్సిపల్ ఆర్ఐ కుర్చీ

హుస్నాబాద్ టౌన్, జూలై 13 : ఐదు నెలలు తిరక్కముందే ఆ సీటులో ముగ్గురు అధికారులు మారారు. మున్సిపల్ శాఖలో ప్రధానమై ఆదాయాన్ని వసూలు చేసే అధికారి సీటు కోసం పోటీపడటం కంటే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకోవడమే ఉత్తమమని భావిస్తుండడంతో ఇప్పటికే ముగ్గురు మారారు. హుస్నాబాద్ మున్సిపాలిటీలో చోటు చేసుకుంటున్న రెవెన్యూ సీటు ఇన్‌చార్జి విషయం సర్వత్రా చర్చనీయంశంగా మారింది.

ఆదాయం వసూళ్లలో రెవెన్యూదే పాత్ర....

మున్సిపాలిటీకి ఎన్ని ఆదాయ వనరులు ఉన్నప్పటికీ వాటిని వసూళ్లు చేసి ఆదాయాన్ని సమకూర్చేది రెవెన్యూ శాఖది మాత్రమే. మున్సిపల్ పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపు, మోటషన్లు, స్థానిక అంగడి, దుకాణాల సముదాయాల అద్దెలు, ఇంటి, నల్లా, ట్రేడ్ లైసెన్సు తదితర వ్యవహారాలన్ని రెవెన్యూ శాఖనే నిర్వహించాల్సి ఉంటుంది. ఆయా విభాగాల నుంచి పన్నులు, అద్దెలు, లైసెన్సు ఫీజులు వసూలు చేసి మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చితే తప్ప మున్సిపల్‌లో పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంటుంది.

సమన్వయలోపమే కారణమా....

రెవెన్యూ ఇన్‌చార్జి అధికారులకు కొందరు అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతుందనే భావన వ్యక్తమవుతున్నది. రెవెన్యూ విభాగం చేస్తున్న పనులను సైతం ఇతరులతో సైతం అధికారులు చేయిస్తుండడంతో తమపై నమ్మకం లేకనే ఇలా జరుగుతుందనే ప్రచారం సాగుతున్నది. దీంతో ఇన్‌చార్జి బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించే విషయంలో పలువురు ఆసక్తి చూపడం లేదనే వాదన వినిపిస్తున్నది. ఇప్పటికైనా అధికారులు వివిధ విభాగం ఇన్‌చార్జీలు సమన్వయంతో పనిచేస్తే మున్సిపల్‌కు ఆదాయాన్ని సమకూర్చే పరిస్థితి ఉంటుంది. లేనిపక్షంలో మున్సిపల్‌కు వచ్చే ఆదాయాన్ని కోల్పోయి పనులు సాగక ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మరి అధికారుల తీరుమారి సమన్వయంతో ముందుకు సాగుతారో లేదో వేచిచూడాలి.

మాకొద్దంటూ.. వెనుకాడుతున్న తీరు..

మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ అధికారి సీటు మాకొద్దు అంటూ వెనుకాడుతున్న తీరు చర్చనీయాంశంగా మారింది. హుస్నాబాద్ మున్సిపాలిటీలో రెగ్యూలర్ ఆర్ఐ కృష్ణ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఇన్‌చార్జి బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్ జాలిగాం శంకర్‌కు అప్పగించారు. ఆయన రెండు నెలలు మాత్రమే ఈ బాధ్యతలను నిర్వర్తించి తప్పుకున్నారు. దీంతో మరో జూనియర్ అసిస్టెంట్ శారదకు రెవెన్యూ ఇన్‌చార్జి బాధ్యతలను మున్సిపల్ అధికారులు అప్పగించారు. ఆమె సైతం రెండు నెలలు మాత్రమే ఈ విధులను నిర్వర్తించడం విశేషం. ఆర్ఐ బాధ్యతలను తప్పించాలని నాలుగు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌కు నివేదించినట్లు తెలిసింది. దీంతో మరో జూనియర్ అసిస్టెంట్ శివకు రెవెన్యూ అధికారి బాధ్యతలను ఇస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆయన సైతం నూతన అధికారి వచ్చేవరకు ఉంటానని చెబుతున్నారు. పైగా ఈ ఇన్‌చార్జి సైతం ఎన్ని నెలలు ఉంటారో తెలియని పరిస్థితి ఉందనే భావన వ్యక్తమవుతున్నది.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

ములుగు, జూలై 13 : గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని బండమైలాం శివారులో శనివారం సాయంత్రం ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. బీదర్‌కు చెందిన మహేశ్, జార్ఖాండ్‌కు చెందిన సద్దాం హుస్సేన్, మేడ్చల్ మల్కాజ్‌గిరికి చెందిన మహ్మద్ అబ్దుల్ సమీర్‌ల వద్ద ఉన్న మూడు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు కేంద్రమంత్రి రాక

హుస్నాబాద్, జూలై 13 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం హుస్నాబాద్‌కు రానున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జరిగే రేణుకా ఎల్లమ్మ బోనాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి సంజయ్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 4గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి బీజేపీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు మహంకాళి ఆషాఢ బోనాలు

మిరుదొడ్డి, జూలై 13 : మండల కేంద్రమైన మిరుదొడ్డి పట్టణంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న ఆషాఢ మాసం పురస్కరించుకొని మహంకాళి దేవి అమ్మ వారికి ఆషాఢం బోనాలు తీయన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు కొమ్మర భగవంత రెడ్డి మాట్లాడుతూ.. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైశ్యుల సన్నాహక సమావేశం

సిద్దిపేట టౌన్, జూలై 13 : సిద్దిపేట వైశ్యకుల సంఘ సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద నిర్వహిస్తున్నామని కుల ప్రతినిధులు కొత్తకొండ రాజు, తోడుపునూరి వెంకటేశం తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సిద్దిపేటలో 6వేల కుటుంబాలతో 25 వేల జనాభా కలిగిన వైశ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కుల సంఘం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి వైశ్యులందరూ హాజరు కావాలని కోరారు.

పేదరికం విద్యకు అడ్డుకారాదు

త్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని రక్షితకు ఆర్థిక సాయం అందజేస్తున్న దుద్దెడ ఉద్యోగుల సంఘం సభ్యులు

కొండపాక (కుకునూరుపల్లి), జూలై 13 : పేదరికం విద్యకు అడ్డుకారాదని దుద్దెడ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొజ్జ రాజు అన్నారు. శనివారం కొండపాక మండలంలోని దుద్దెడ ప్రభుత్వ పాఠశాలలో చదివి త్రిబుల్ ఐటీకి ఎంపికైన పబ్బోజు రక్షితను దుద్దెడ ఉద్యోగుల సంఘం తరపున ఘనంగా సన్మానించడంతో పాటు రూ.10,500 ఆర్థిక సాయం అందజేశారు. కుకునూరుపల్లి విద్యుత్ శాఖ ఏఈ తాళ్లపల్లి రాజేంద్రప్రసాద్ విద్యార్థినికి రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో దుద్దెడ ఉద్యోగుల సంఘం సభ్యులు సంతోశ్, రాధాకృష్ణ, భాస్కర్, ప్రభాకర్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కేజీవీబీలో ఫ్రెషర్స్ పార్టీ

మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి స్వప్న

మద్దూరు (ధూళిమిట్ట), జూలై 13 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం ప్రత్యేక అధికారి స్వప్న అధ్యక్షతన ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమంతో పాటు విద్యార్థినులకు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అవధాన విద్యకు మెదక్ పుట్టినిల్లు

మాట్లాడుతున్న డాక్టర్ చెప్పెల హరినాథశర్మ

కొండపాక (కుకునూరుపల్లి), జూలై 13 : అవధాన విద్యకు మెతుకు సీమ పుట్టినిల్లని ప్రముఖ అష్టావధాని డాక్టర్ బోచ్చర్ ఓం ప్రకాశ్ అన్నారు. శనివారం కొండపాక మండలంలోని మర్పడగ శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి బండకాడి అంజయ్య గౌడ్ అష్టావధానం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఓం ప్రకాశ్ మాట్లాడుతూ.. అష్టకాల నరసింహ రామశర్మ, గుమ్మనగారి లక్ష్మీనరసింహ శర్య అష్టావధానం పక్రియను సామాన్యుడి చెంతకు తీసుకెళ్లాలన్నారు. గౌరిభట్ల రామకృష్ణ కవి అవధాన కళా వికాసానికి పలువురిని ప్రోత్సహించారని, శతావధాని జీఎం రామశర్మ ప్రపంచ తెలుగు మహాసభలలో సిద్దిపేట కీర్తి ప్రతిష్టలు చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో పరశురాములు, కోటిలింగశర్మ, అనురాధ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

త్వర